TEL:T/TG/2024/0814

# మన వెలుగు

ప్రతి వార్త ప్రజల వైపు   తెలుగు దినపత్రిక

MANA VELUGU TELUGU DAILY

విలేఖరులు కావలెను...

మన వెలుగు తెలుగు దినపత్రికకు
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు
మరియు నియోజకవర్గ,మండలవారిగా విలేఖరులు కావలెను,
తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలు
రాయగలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును..
మరిన్ని వివరాలకు సంప్రదించండి...

నెట్ వర్క్ ఇంచార్జి సెల్ : 9533397954

పబ్లిషర్ : హైదరాబాద్   సంపుటి :01   సంచిక : 159   శనివారం 01-02-2025   పేజీలు :06   వేల : 05/-

# నీళ్ల మీద రేవంత్ రెడ్డి ప్రభుత్వం నీచ రాజకీయం

- జలాలపై రాజకీయం చేయడం మానేసి ప్రభుత్వం వాస్తవాలు చెప్పాలి
- మేడిగడ్డ బ్యారేజీ మేరునగధీరుడిలా నిలబడింది
- కాంగ్రెస్ ప్రభుత్వం రాజనీతజ్ఞతను ప్రదర్శించాలి
- సీఎం రేవంత్ రెడ్డి మిస్ గైడెడ్ మిస్సైల్ లా పనిచేస్తున్నారు
- నీళ్లు - నిజాలు రౌండ్ టేబుల్ సమావేశంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



**హైదరాబాద్ :** నీళ్ల విషయంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం నీచ రాజకీయం చేస్తున్నదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విరుచుకుపడ్డారు. నీటి విషయాల్లో రాజకీయం చేయడం మానేసి నిజాలు చెప్పాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కేసీఆర్ పై అక్కసుతో కాళేశ్వరం ప్రాజెక్టుపై దుష్ప్రచారం చేయడమే కాకుండా రైతులకు నీళ్లు ఇవ్వకుండా పొలాలను ఎండబెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ బురదరాజకీయానికి గోదావరి వరదను కూడా తట్టుకొని మేడిగడ్డ బ్యారేజీ మేరునగధీరుడిలా నిలబడిందని అన్నారు. తెలంగాణ జలవనరులు, ప్రాజెక్టలపై "నీళ్లు - నిజాలు" అనే అంశంపై తెలంగాణ జాగృతి సంస్థ శుక్రవాం నాడు సోమాజీగూడ ప్రెస్ క్లబ్ లో రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేసింది. సమావేశంలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితతో పాటు మేధావులు, విశ్రాంత ఇంజనీర్లు పాల్గొన్నారు. అనంతరం పలు తీర్మానాలు ఆమోదించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాయడం జరిగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ... కేసీఆర్ పూర్తి చేసిన ప్రధాన ప్రాజెక్టుల్లో మిగిలి ఉన్న చిన్న చిన్న పనులను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. రాజకీయాలకు అతీయంగా కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాలని, కాంగ్రెస్ ప్రభుత్వం రాజనీతజ్ఞతను ప్రదర్శించాలని సూచించారు. "వైఎస్ఆర్ ప్రారంభించిన ఆరోగ్య శ్రీని కేసీఆర్ కొనసాగించారు.. కాంగ్రెస్ ప్రారంభించిన ఉపాధి హామీ పథకాన్ని బీజేపీ కొనసాగిస్తోంది. అదే తరహాలో కేసీఆర్ ప్రారంభించిన పనులను సీఎం రేవంత్ రెడ్డి కొనసాగించాలి. సీఎం రేవంత్ రెడ్డి మిస్ గైడెడ్ మిస్సైల్ లా పనిచేస్తున్నారు. కేసీఆర్ శతృవు అని రేవంత్ రెడ్డి అనుకుంటున్నారు.. కానీ మన జలాలను తరలిస్తున్న ఆంధ్రా పాలకులు మన శతృవులని ఆయన గమనించాలి." అని వ్యాఖ్యానించారు. ఆంధ్ర కేడర్ లో పనిచేసిన ఆదిత్యానాథ్ దాస్ ను ఇరిగేషన్ సలహదారు పదవి నుంచి తొలగించాలని, కృష్ణ ట్రైబ్యునల్ లో రాష్ట్రం తరఫున బలంగా వాదనలు వినిపించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ నాయకత్వంలో అవిశ్రాంతంగా పని చేస్తేనే కోటి ఎకరాల మాగాణంగా మారిందని, ఎంతో మంది మేధావుల, ఇంజనీర్ల కృషి ఫలతమే అనేక ప్రాజెక్టుల నిర్మాణమని తెలిపారు. తెలంగాణ సమగ్రాభివృద్ధిలో నీటి వనరులు ఒక ప్రధాన అంశంగా పెట్టుకొని ముందుకెళ్లామని, కానీ ఈ ప్రభుత్వం జలవనరుల రంగాన్ని విర్మిస్తున్నదని విమర్శించారు. ఉమ్మడి రాష్ట్రంలో 60 ఏళ్లలో కేవలం 50 లక్షల ఎకరాలకు నీళ్లందించారని, కానీ తెలంగాణ ఏర్పడిన తర్వాత పదేళ్లలో కోటి ఎకరాలకుపైగా నీళ్లందించామని, కాలంతో పోటీ పడి ప్రపంచంలోనే అత్యద్భుతమైన కాళేశ్వరం ప్రాజెక్టును కేసీఆర్ నిర్మించారని వివరించారు. మొత్తం కోటి 24 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేలా బిఆర్ఎస్ హయాంలో ప్రాజెక్టులను పూర్తి చేశామని పేర్కొన్నారు. మిషన్ కాకతీయ ద్వారా చెరువులను బాగు చేసుకొని 15 లక్షల ఎకరాలకు నీళ్లించుకోవడం జరిగిందని, కేవలం చెరువులను బాగు చేసుకోవడం వల్ల 9.6 టీఎంసీల నీటిని ఒడిసి పట్టుకున్నామని అన్నారు. అందుకు సాక్ష్యం తెలంగాణ ఏర్పడే సమయానికి 68 లక్షల టన్నుల వరి పండితే... 2022-23 నాటికి కోటి 68 లక్షల టన్నుల ధాన్యం పండిందని, వరి పండించే రాష్ట్రాల్లో తెలంగాణ మొదటి స్థానానికి ఎదిగిందని స్పష్టం చేశారు. ఇన్ని చేసినా పదేళ్లలో ఏమి జరగలేదని

# ప్రజావాణికి 9,307 దరఖాస్తులు

**హైదరాబాద్, జనవరి 31:** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 9307 దరఖాస్తులు అందాయి. పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ కు సంబంధించి 211, విద్యుత్ శాఖ కు సంబంధించి 160, రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 43, ప్రవాసి ప్రజావాణికి సంబంధించి 01, ఇందిరమ్మ ఇండ్లు పథకం కోసం 7100 దరఖాస్తులు వచ్చాయి, పౌర సరఫరాల శాఖ కు సంబంధించి 1736 (రేషన్ కార్డులు) దరఖాస్తులు వచ్చాయి, ఇతర శాఖలకు సంబంధించి 56 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్.చిన్నారెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్ని దరఖాస్తులు స్వీకరించారు. ప్రజాభవన్ కు వచ్చిన వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.



# వన్ నేషన్ వన్ ఎలక్షన్ దిశగా అడుగులు పడుతున్నాయి

- రాష్ట్రపతి ద్రౌపది ముర్మూ



**న్యూ ఢిల్లీ జనవరి 31:** దేశ అభివృద్ధి ఫలాలు ప్రజలందరికీ చేరాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్మూ తెలిపారు. త్వరలోనే భారత్ ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతోందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు కూడా మధ్యతరగతివారేనని, వాళ్ల కోసం 8వ పేకమిషన్‌ను ఏర్పాటు చేశామన్నారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్మ ప్రసంగించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన ద్వారా లక్షలాది మంది సొంతింటి కల నెరవేరుతోందని, 3 కోట్ల పేద కుటుంబాలకు ఇళ్లు నిర్మిస్తున్నామని వివరించారు. అమృత్ భారత్, నమో భారత్ రైళ్లు అందుబాటులోకి వచ్చాయని, వన్ నేషన్‌వన్ ఎలక్షన్ దిశగా అడుగులు పడుతున్నాయన్నారు.బ్యాంకింగ్ డిజిటల్ వ్యవస్థను తీసుకొచ్చామని, నూతన విద్యా విధానంతో ఆధునిక విద్యా వ్యవస్థ ఏర్పాటు చేశామని, మానవ సంహిత అంతరిక్ష యాత్రలు చేసే రోజు ఎంతో దూరంలో లేదని, కృత్రిమమేధ అభివృద్ధికి ఇండియా ఎఐ మిషన్‌ను ప్రారంభించామని ద్రౌపది తెలియజేశారు. డిజిటల్ సాంకేతికతలో భారత కీలక పాత్ర పోషిస్తోందని, సామాజిక న్యాయం, సమానత్వ సాధనకు డిజిటల్ సాంకేతికత వాడుతున్నామని, స్టార్టప్‌లు, క్రీడలు, అంతరిక్ష రంగాల్లో యువత దేశానికి వన్నె తెస్తోందని, మారుమూల ప్రాంతాల్లో డిజిటల్ సేవల కల్పనలో మహిళలు కీలకపాత్ర పోషిస్తున్నారని ముర్మూ ప్రశంసించారు. 3 లక్షల మంది మహిళలను లక్‌పతి దీదీలుగా మార్చాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, డ్రోన్ దీదీ స్కీమ్.. మహిళలకు ఉపయోగపడుతోందన్నారు. నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ ప్రారంభించామని, భారత్‌ను గ్లోబల్ ఇన్నోవేషన్ పవర్‌హౌస్‌గా మారుస్తామన్నారు.

# గోషామహల్‌లో ఉస్మానియా ఆస్పత్రి భవనానికి సిఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన



**హైదరాబాద్ జనవరి 31 :** గోషామహల్‌లో ఉస్మానియా ఆస్పత్రి నూతన భవనానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. గోషామహల్ మైదానంలో 26.3 ఎకరాల్లో రెండు వేల పడకలతో కొత్త ఉస్మానియా ఆస్పత్రి భవన నిర్మాణం చేపట్టనున్నారు. రూ.2400 కోట్లతో 14 అంతస్తుల్లో ఉస్మానియా ఆస్పత్రి భవనాన్ని నిర్మిస్తున్నారు. అత్యాధునిక వైద్య సౌకర్యాలతో 30 విభాగాల్లో వైద్య సేవలు అందించనున్నారు. కొత్త ఆస్పత్రిలో రోబోటిక్ సర్జరీలు చేపట్టే విధంగా సౌకర్యాలు కల్పించనున్నారు. అన్నిరకాల సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు, ప్రతి విభాగినికి ప్రత్యేకంగా ఆపరేషన్ థియేటర్లు, ప్రతి థియేటర్‌కు అనుబంధంగా పోస్ట్ ఆపరేటివ్, ఐసియు వార్డులు, గ్రౌండ్ ఫ్లోర్‌లో ఒకే చోట అన్నిరకాల డయాగ్నసిస్ సేవలు, అత్యాధునిక టెక్నాలజీతో కూడిన మార్చురీ, స్టేట్ ఆఫ్ ఆర్ట్ ఫెసిలిటీస్ కూడిన ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ యూనిట్లకు రూపకల్పన చేశారు.అలాగే అండర్ గ్రౌండ్ రెండు ఫ్లోర్లలో పార్కింగ్, ఆసుపత్రి సమీపంలో ఫైర్ స్టేషన్, ఆసుపత్రి చుట్టూ విశాలమైన రహదారులు, ఆసుపత్రి ప్రాంగణంలో ఎక్కడికైనా ఫైర్ ఇంజిన్లు, అంబులెన్స్‌లు తిరిగే మార్గాలు, దివ్యాంగులు ఆసుపత్రిలోకి రాకపోకలు సాగించేందుకు వీలుగా ర్యాంప్‌లు, ఆసుపత్రిలోని రోగులకు సహాయకులుగా వచ్చే వారు సేద తీరేందుకు డార్మెటరీలు, క్యాంటీన్, మరుగుదొడ్లు నిర్మించనున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు భట్టి విక్రమార్క, దామోదర్ నరసింహ, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, తదితరలు హాజరయ్యారు.

# నీళ్ల మీద రేవంత్ రెడ్డి ప్రభుత్వం

## నీచ రాజకీయం

కాంగ్రెస్ నాయకులు ఆరోపణలు చేయడం బాధాకరమన్నారు. గతంలో కాంగ్రెస్, టీడీపీ పార్టీలు పరిపాలించి ప్రాజెక్టుల్లో పల్లేర్లు మొలిపించాయని, కాంగ్రెస్ నాయకులు పదవుల కోసం పైరవీలు చేసుకున్నారు తప్ప ప్రాజెక్టుల కోసం కొట్లాడలేదని మండిపడ్డారు. గట్టిగా జై తెలంగాణ అంటే... వెంటనే ఫేక్ ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేసేవారని గుర్తు చేశారు. "వైఎస్ఆర్ పోతిరెడ్డిపాడు ప్రాజెక్టు ద్వారా రాయలసీమ ప్రాంతానికి మన జలాలను తరలించారు. అదే ఒరవడిని జగన్, చంద్రబాబు కొనసాగించారు. అందులో భాగంగానే ఏపీ ప్రభుత్వం రాయలసీమ ఎత్తిపోతల, పోలవరం- బనకచర్ల ప్రాజెక్టులను చేపడుతున్నాయి. ఇన్నాళ్లు కాంగ్రెస్, టీడీపీలే అన్యాయం చేశాయనుకుంటే... ఇప్పుడు వాటికి బీజేపీ తోడయ్యింది. నాగార్జున సాగర్ ప్రాజెక్టు వద్ద కేంద్ర బలగాలను మోహరింపజేశారు. కృష్ణా జలాల దోపిడీని ఎన్టీఆర్, చంద్రబాబు, వైఎస్ఎస్, జగన్ కొనసాగించారు. ఇప్పుడు గోదావరి నదిపై కూడా ఆంధ్రా నాయకుల కన్ను పడింది. రాష్ట్రంలో తెలంగాణ సోయితో పరిపాలనం జరగడం లేదు." అని వ్యాఖ్యానించారు. కేసులు వేసి ప్రాజెక్టులను అడ్డుకున్న నీచమైన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని ధ్వజమెత్తారు. జలవనరుల విషయాల్లో ఇతర రాష్ట్రాల్లో పార్టీలకు అతీతంగా ఒక్కటవుతారని, కానీ తెలంగాణ మాత్రం కాంగ్రెస్, బీజేపీ పార్టీలు రాజకీయం చేస్తున్నాయని ఎండగట్టారు. కేసీఆర్ నిర్మించిన ప్రాజెక్టులు పనికిరావని దుష్ప్రచారం చేస్తున్నారని, నీళ్లు ఇవ్వక రైతుల పొట్టకొడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి సొంత జిల్లా, ఇరిగేషన్ శాఖ మంత్రి సొంత జిల్లాలో పంటను ఎండగొట్టారని ఉదాహరించారు. బీఆర్ఎస్ హయాంలోనే సీతారామ ఎత్తిపోతల పథకం పనులు దాదాపు పూర్తయ్యాయని, కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని ఆర్భాటంగా ప్రారంభించినా ఆ ప్రాజెక్టు ద్వారా చుక్క నీరు కూడా ఇవ్వలేదని చెప్పారు. రౌండ్ టేబుల్ సమావేశంలో మాజీ కార్పోరేషన్ చైర్మన్ వీ ప్రకాశ్, సాగునీటి శాఖ మాజీ ఓఎస్డీ, విశ్రాంత ఇంజనీర్ శ్రీధర్ రావు దేశ్ పాండే, బీఆర్ఎస్ నాయకుడు పల్లె రవి కుమార్ గౌడ్, రిటైర్డ్ సీఈ ఖగేందర్, తెలంగాణ రిటైర్డ్ ఇంజనీర్స్ ఫోరం మాజీ అధ్యక్షుడు దామోదర్ రెడ్డి, తెలంగాణ జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి, తెలంగాణ ఇంజనీర్స్ జేఏసీ కార్యదర్శి వెంకటేశం, అంతర్ రాష్ట్ర వ్యవహారాల మాజీ ప్రభుత్వ సలహాదారు టంకశాల అశోక్, ఫ్లోరోసిస్ విమోచన సమితి నాయకులు కంచుకట్ల శ్రీనివాస్, తెలంగాణ గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఆయాచితం శ్రీధర్, టీఎస్పీఎస్సీ మాజీ సభ్యురాలు సుమిత్రానంద్, మాజీ కార్పొరేషన్ చైర్మన్ దేవి ప్రసాద్, సీనియర్ జర్నలిస్టు కామెర నవీన్ కుమార్, బీసీ సంఘం నాయకుడు బొళ్ల శివశంకర్ , ఏల్చల దత్తాత్రేయ తదితరులు పాల్గొన్నారు.ఆమోదించిన తీర్మానాలు: మేడిగడ్డ బ్యారేజీ పునరుద్ధరించాలి.. కాళేశ్వరం ప్రాజెక్టు లింక్ -1 పూర్తి స్థాయిలో వినియోగం లోకి తేవాలి ఇరిగేషన్ అడ్వైజర్ పోస్ట్ నుంచి ఆడిత్యనాథ్ దాస్ ను తొలగించాలి ఏపీ అక్రమంగా నిర్మిస్తోన్న పోలవరం - బనకచర్ల (గోదావరి - కృష్ణా - పెన్నా లింక్) ప్రాజెక్టు పై అపెక్స్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయాలని కోరుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు లేఖ రాయాలి. కృష్ణా ట్రిబ్యునల్ లో తెలంగాణ కు బేసిన్, క్యాచ్ మెంట్, కమాండ్ ఏరియా, డ్రాట్ పోన్ ఏరియా ప్రాతిపదికన 575 టీఎంసీల నికర జలాలు సాధించేలా సమర్థ వాదనలు వినిపించాలి.. ట్రిబ్యునల్ పై అల్ పార్టీ మీటింగ్ నిర్వహించాలి. పోలవరం నుంచి కృష్ణా డెల్టాకు మళ్లించే గోదావరి జలాలకు బదులుగా నాగార్జున సాగర్ కు ఎగువన 80 టీఎంసీల కృష్ణా నికర జలాల వినియోగానికి బచావత్ ట్రిబ్యునల్ పరమైన రక్షణలు ఉన్నాయి.. ఇందులో తెలంగాణ కు 45 టీఎంసీలు దక్కుతాయి. ఇప్పుడు పోలవరం నుంచి 200 టీఎంసీలను మళ్లించాలని ఏపీ కొత్త ప్రాజెక్టు చేపట్టింది కాబట్టి మిగిలిన 120 టీఎంసీల్లోనూ తెలంగాణ కు 80 టీఎంసీల నికర జలాలు కేటాయించేలా .. మొత్తం 125 టీఎంసీల సాధనకు బ్రజేశ్ కుమార్ ట్రిబ్యునల్ ఎదుట బలమైన వాదనలు వినిపించాలి.

గోదావరి - మూసీ ప్రాజెక్టును మల్లన్న సాగర్ నుంచి కాకుండా తక్కువ ఖర్చుతో పూర్తయ్యే కొండపోచమ్మ సాగర్ నుంచి చేపట్టాలి.ఇరిగేషన్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేయడానికి ఏటా రూ.20 వేల కోట్లకు తగ్గకుండా బడ్జెట్ కేటాయించి ఖర్చు చేయాలి.నాగార్జున సాగర్ ప్రాజెక్టును పూర్తిగా తెలంగాణ ప్రభుత్వ అధీనంలోకి తేవాలి జూరాల ప్రాజెక్టు కు వచ్చే వరదను సమర్థవంతంగా వినిగించుకునేలా మరో ఎత్తిపోతల పథకం చేపట్టాలి. వార్ధ బ్యారేజీ పనులు సత్వరమే చేపట్టి మంచిర్యాల, అసిఫాబాద్ జిల్లాలకు 2 లక్షల ఎకరాలకు నీలివ్వాలి.రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని పూర్తిగా ఆపేలా కేంద్రం పై ఒత్తిడి తీసుకురావాలి.పాలమూరు - రంగారెడ్డి, డిండి ఎత్తిపోతలు, ఎస్ ఎల్ బీసీ ప్రాజెక్టులను తక్షణమే పూర్తి చేసి వాటికి నికర జలాలు సాధించేందుకు ట్రిబ్యునల్ దగ్గర సమర్థవంతమైన వాదనలు వినిపించాలి.సీతమ్మ సాగర్ మల్టీ పర్పస్ ప్రాజెక్టుతో పాటు సీతారామ ఎత్తిపోతల పథకం పనులు త్వరితగతిన పూర్తి చేయాలి.కేంద్రం వద్ద పెండింగ్ లో ఉన్న ప్రాజెక్టులకు అనుమతులు సాధించాలి.

# తగిన సమయం అంటే ఎంత..

## స్పీకర్ ను ప్రశ్నించిన సుప్రీం

**న్యూ ఢిల్లీ జనవరి 31 :** పార్టీ ఫిరాయించిన బిఆర్ఎస్ ఎమ్మెల్యేలపై సుప్రీంకోర్టులో విచారణ జరుగుతోంది. 10 నెలలు అవుతున్నా స్పీకర్ నిర్ణయం తీసుకోకపోవడంపై కోర్టు అభ్యంతరం వ్యక్తం చేసింది. కనీసం నోటీసులు కూడా ఇవ్వలేదన్న బిఆర్ఎస్ తరపున లాయర్ వాదించారు. ఫిరాయింపులపై నిర్ణయం తీసుకోవడానికి మీ దృష్టిలో తగిన సమయం అంటే ఎంత అని స్పీకర్ ను సుప్రీం ప్రశ్నించింది. రీజనబుల్ టైమ్ అంటే మహారాష్ట్ర తరహాలో శాసనసభ గడువు ముగిసే వరకా అని కోర్టు చురకలంటించింది. స్పీకర్‌ను అడిగి నిర్ణయం చెబుతానని సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి తెలిపారు. విచారణ వచ్చే వారానికి సుప్రీంకోర్టు వాయిదా వేసింది.

# చావు బతుకుల్లో 2,500 మంది పిల్లలు



చావు బతుకుల్లో ఉన్న 2,500 మంది పిల్లలను వైద్య చికిత్స కోసం గాజా నుండి తరలించాలని ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్ పిలుపునిచ్చారు. రాబోయే వారాల్లో మరణాల సంఖ్య పెరిగే అవకాశం ఉందని ఆయన తెలియజేశారు. కాలిఫోర్నియా ట్రామా సర్జన్ ఫిరోజ్ సిద్వా మాట్లాడుతూ, అత్యవసర చికిత్స అవసరమైన రోగులలో 2,500 మంది పిల్లలు ఉన్నారని చెప్పారు. గత సంవత్సరం మార్చి 25 నుండి ఏప్రిల్ 8 వరకు గాజాలో పనిచేసిన వ్యక్తి ఫిరోజ్ సిద్వా. "రాబోయే కొన్ని వారాల్లో దాదాపు 2,500 మంది పిల్లలు చనిపోయే అవకాశం ఉంది. కొందరు ఈరోజు చనిపోతున్నారు. కొందరు రేపు చనిపోతారు. మరికొందరు మరుసటి రోజు చనిపోతారు" అని గుటెర్రెస్‌తో సమావేశం తర్వాత సిద్వా విలేకరులతో అన్నారు. ఇజ్రాయెల్-గాజా కాల్పుల విరమణ ఒప్పందం ప్రకారం ప్రమాదంలో ఉన్న వారిని సురక్షితంగా ఉంచడానికి ఒక యంత్రాంగం ఉండాలని, కానీ అలాంటి చర్య ఇంకా జరగలేదని వైద్యులు తెలిపారు. పిల్లలను తరలించడానికి ఇంకా ఎటువంటి చర్యలు తీసుకోలేదు. 2023 అక్టోబర్ లో యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌ఓ) మద్దతుతో 5,383 మంది రోగులను తరలించారు.


# ఎపి కొత్త డిజిపిగా హరీష్ కుమార్ బాధ్యతలు



**అమరావతి జనవరి 31 :** ఎపి డిజిపి ద్వారకా తిరుమల రావు తన పదవికి వీడ్కోలు పలికారు. పరేడ్ లో కొత్త డిజిపిగా హరీష్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా హరీష్‌కుమార్ మాట్లాడారు. పోలీసుశాఖపై ద్వారకా తిరుమలరావు చెరగని ముద్ర వేశారని ప్రశంసించారు. ప్రజల భద్రత కోసం అనేక సంస్కరణలు, డ్రగ్స్ నియంత్రణకు ఈగల్ టీం ఏర్పాటు చేశారని తెలిపారు. ఎపి డిజిపిగా తన శక్తి మేర పనిచేస్తానని హరీష్ కుమార్ గుప్తా పేర్కొన్నారు. సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టులపై చర్యలుంటాయని హెచ్చరించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్, టెక్నాలజీ కొనసాగిస్తామని గుప్తా తెలియజేశారు.

# గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలపై నేతలకు

## చంద్రబాబు కీలక సూచనలు



**అమరావతి జనవరి 31 :** ఎన్డీయే పక్షాలతో సమన్వయ సమావేశాలు పెట్టుకుని ఎంఎల్ సి ఎన్నికలలో పని చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలపై నేతలకు కీలక సూచనలు చేశారు. ఎన్డియే కూటమి మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యేలతో ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాజశేఖర్, రాజేంద్రప్రసాద్ ను భారీ మెజారిటీతో గెలిపించాలని పేర్కొన్నారు. ఏ ఎన్నిక వచ్చినా గెలిచినప్పుడే సుస్థిర పాలన ఉంటుందని, తొలిసారి గెలిచినా, కొత్తగా వచ్చిన నేతలు మరింత చిత్తశుద్ధితో పని చేయాలని సూచనలు చేశారు. రాత్రికి రాత్రే అన్నీ జరిగిపోతాయని చెప్పట్లేదని, గాడి తప్పిన వ్యవస్థలను సరిదిద్దుతున్నామని స్పష్టం చేశారు. త్వరలోనే 16,347 టీచర్ పోస్టులకు డిఎస్సి నోటిఫికేషన్ ఇస్తున్నామని చంద్రబాబు చెప్పారు.

# 2014 తరువాత మొదటి సారిగా విదేశాల

## నుంచి ఎటువంటి ప్రయత్నమూ జరగలేదు

◆ఈ దఫా పార్లమెంట్ సెషన్ ఒక విధంగా విశిష్టమైనది

◆ప్రతిపక్షాల తీరుపై కూడా వ్యంగ్యోక్తులు విసిరిన ప్రదాని మోడీ

**న్యూఢిల్లీ జనవరి 31 :** పార్లమెంట్ సెషన్ ప్రారంభం కావడానికి ముందు దేశంలో 'అగ్గి రగిల్చేందుకు' బహుశా 2014 తరువాత మొదటి సారిగా విదేశాల నుంచి ఎటువంటి ప్రయత్నమూ జరగలేదని ప్రధాని నరేంద్ర మోడీ శుక్రవారంచెప్పారు. పార్లమెంట్ బడ్జెట్ సెషన్‌కు ముందు విలేకరులతో మాట్లాడిన ప్రధాని మోడీ ప్రతిపక్షాల తీరుపై కూడా వ్యంగ్యోక్తులు విసిరారు. 2014 దరిమిలా ప్రతి సెషన్‌కు ముందు ఏదో ఒక అలజడి రేకెత్తించేందుకు విదేశాల్లో కొందరు సిద్ధంగా ఉండేవారని, అటువంటి యత్నాలను



ఎగసనదోసేవారికి ఇక్కడా కొరత ఉండేది కాదని ఆయన ఆరోపించారు. (బహుశా 2014 తరువాత మొదటిసారిగా పార్లమెంట్ బడ్జెట్ సెషన్‌కు ఒకటి రెండు రోజుల ముందు విదేశాల నుంచి అగ్గి రగిల్చేందుకు ఎటువంటి యత్నమూ జరగలేదు' అని అన్నారు. 'విదేశాల్లో ఎక్కడ నుంచీ అగ్గి రగిల్చే యత్న ఏడీ జరగకనపోవడం గల పది సంవత్సరాల్లో మొదటిసారిగా చూస్తున్నాను' అని ప్రధాని చెప్పారు.తన ప్రభుత్వం మూడవ విడత శనివారం తన పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుండడంతో, నిరుపేద, మధ్య తరగతి వర్గాలవారిని లక్ష్మీదేవి కనికరించాలని తాను ప్రార్థించినట్లు తెలియజేశారు. 2047 నాటికి 'వికసిత్ భారత్' లక్ష్యాన్ని సాధించడంలో కొత్త విశ్వాసాన్ని, శక్తిని ఈ బడ్జెట్ సెషన్ ఇస్తుందనే దృఢనమ్మకాన్ని మోడీ వ్యక్తం చేశారు. సర్వతోముఖ అభివృద్ధి కోసం తన ప్రభుత్వం మూడవ విడత మిషన్ తరహాలో వ్యవహరిస్తోందని ఆయన చెప్పారు. సృజనాత్మకత, సమ్మిళితం, పెట్టుబడి ప్రభుత్వ ఆర్థిక అజెండాను తీర్చిదిద్దాయని ఆయన తెలిపారు. ఈ సెషన్‌లో పలు చరిత్రాత్మక బిల్లులు చేపట్టనున్నట్లు, దేశ పటిష్ఠతకు సమగ్ర చర్చ అనంతరం అవి చట్టాలు కానున్నట్లు మోడీ చెప్పారు. 'ముఖ్యంగా, మహిళలు సమాన హక్కులు పొందేందుకు, వర్గ లేదా మతవిశ్వాస ఆధారిత వివక్ష తొలగించేందుకు వీలుగా వారి సాధికారతకు ఈ సెషన్‌లో ముఖ్యమైన నిర్ణయాలు తీసుకోనున్నారు' అని ఆయన సూచించారు.ప్రతి ఎంపి, ముఖ్యంగా యువ ఎంపిలు ఈ సెషన్‌లో 'వికసిత్ భారత్' అజెండాకు దోహదం చేస్తారనే దృఢనమ్మకాన్ని కూడా మోడీ వ్యక్తం చేశారు. 'సంస్కరణ, శీఘ్రతర అభివృద్ధిని సాధించవలసి ఉంటుందని, సంస్కరణపైననే గరిష్ఠ స్థాయిలో ప్రాధాన్యం ఉందని చెప్పారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు కలసి వ్యవహరించవలసి ఉంటుందని, ప్రజల భాగస్వామ్యం ద్వారా పరివర్తనను చూడవచ్చునని ఆయన సూచించారు. 'మనది పిన్న వయస్క దేశం ఒ ఇప్పుడు 2025 వయోవర్గంలో ఉన్న యువజనులు 45, 50 ఏళ్ల వారు అయినప్పుడు వారి అభివృద్ధి భారతదేశ అతిపెద్ద లబ్ధిదారులు అవుతారు. వారి వయో దశలో వారు విధాన నిర్ణయ వ్యవస్థలో కూర్చుంటారు ఒ వారు గర్వంగా అభివృద్ధి చెందిన భారత్‌తో పాటు ముందుకు సాగుతారు' అని మోడీ పేర్కొన్నారు.ఈ బడ్జెట్ సెషన్‌లో ఎంపిలు అందరూ అభివృద్ధి భారతం సంకల్పాన్ని పటిష్ఠం చేసేందుకు కృషి చేస్తారని మోడీ అన్నారు. 'ముఖ్యంగా మన యువ ఎంపిలకు ఇది సువర్ణావకాశం, ఎందుకంటే ఇప్పుడు సభలో మరింత చైతన్యం, భాగస్వామ్యంతో అభివృద్ధి భారత ఫలాలను వారు తమ కళ్ల ముందు చూడగలరు. అందువల్ల ఇది యువ ఎంపిలకు అమూల్య అవకాశం' అని ప్రధాని అన్నారు. 'మనం ఈ బడ్జెట్ సెషన్‌లో దేశం ఆశలు, ఆకాంక్షల సాఫల్యానికి కృషి చేయగలమని ఆశిస్తున్నాను' అని మోడీ చెప్పారు. కాగా, శుక్రవారం బడ్జెట్ సెషన్ ప్రారంభానికి ముందు లోక్‌సభలో సమీకృతమైన పార్లమెంట్ ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగించారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ వరుసగా ఎనిమిదవ సారి శనివారం కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు.

# బంగారు గనిలో కొండచరియలు విరిగిపడి 10మంది మృతి

బంగారు గనిలో కొండచరియలు విరిగిపడి 10 మంది మృతి చెందిన ఘోర ఘటన పశ్చిమాఫ్రికా దేశమైన మాలిలో జరిగింది. మాలిలోని కౌలికోరో ప్రాంతంలో ఉన్న బంగారు గనిలో కొండచరియలు విరిగిపడడంతో 10 మంది మృతి చెందారు. పలువురి ఆచూకీ ఇంకా తెలియలేదు. బుధవారం ఈ ఘటన జరిగినట్లు గవర్నర్ కల్నల్ లామైన్ కపోరో సనొగో వెల్లడించారు. బంగారం వెతుకులాటకు వెళ్లి వారంతా శిథిలాల కింద చిక్కుకుపోయారని, మృతుల్లో ఎక్కువ మంది మహిళలే ఉన్నారని తెలిపారు. గనిలోకి ఒక్కసారిగా బురద నీరు ప్రవేశించి వారిని చుట్టిముట్టిందన్నారు. మరికొంతమంది శిథిలాల కింద చిక్కుకుపోయారని, వారిని రక్షించడానికి రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోందని గవర్నర్ వివరించారు. ఈ దుర్ఘటనలో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని, గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. బంగారు గని కూలడానికి గల కారణాలపై దర్యాప్తు జరుగుతోందన్నారు. ఈ భారీ ప్రమాదంపై ఆ దేశ గనుల మంత్రిత్వ శాఖ విచారం వ్యక్తం చేసింది. ఆఫ్రికా దేశాల్లో మూడో అతిపెద్ద బంగారు ఉత్పత్తిదారుగా ఉన్న మాలిలో ఇలాంటి ప్రమాదాలు సర్వసాధారణంగా మారిపోయాయి. గతేడాది కూడా ఇదే ప్రాంతంలోని కంగబా జిల్లాలో బంగారు గని కుప్పకూలి.. 70 మందికి పైగా మరణించారు. ఎలాంటి భద్రతా చర్యలను పాటించకుండా అక్రమ మైనింగ్ కు పాల్పడుతుండడంతో ఈ ప్రమాదాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. భవిష్యత్ లో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా మైనింగ్ రంగంలో చర్యలు తీసుకోవాల్సి ఉంది.

# 8 మంది బందీలను విడుదల చేయనున్న హమాస్

**గాజా స్ట్రిప్ :** హమాస్ గురువారం మరో ముగ్గురు ఇజ్రాయిల్ బందీలను, ఐదుగురు థాయ్ బందీలను విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. ఈ నెల ప్రారంభంలో గాజా స్ట్రిప్‌లో కాల్పుల విరమణ ప్రారంభమైన తర్వాత హమాస్ మూడవ విడత బందీలను విడుదల చేస్తోంది. ఉత్తర గాజాలోని జబాలియా పట్టణ శరణార్థుల శిబిరంలో నిర్వహిస్తున్న ఓ కార్యక్రమంలో హమాస్ మహిళా ఇజ్రాయిలీ సైనికురాలు అగామ్ బెర్గర్ (20)ని రెడ్‌క్రాస్‌కి అప్పగించింది. బెర్గర్‌ను అప్పగించినట్లు ఇజ్రాయిల్ ధృవీకరించింది. 2023, అక్టోబర్ 7న హమాస్ బందీలుగా పట్టుకున్న 100 మందిలో బెర్గర్ సహా ఐదుగురు సైనికులు ఉన్నారు. మిగిలిన నలుగురు సైనికులను శనివారం (జనవరి 25)న విడుదల చేశారు. బెర్గర్‌తో పాటు మరో ఇద్దరు ఇజ్రాయిలీలు అర్బెల్ యెహౌద్, మోసెస్‌లను హమాస్ గురువారం విడుదల చేయనుంది. విడుదల కానున్న థాయ్ జాతీయుల గురించిన అధికారిక వివరాలు తెలియలేదు. 2023 నవంబర్‌లో వారం రోజుల కాల్పుల విరమణ సమయంలో 100 మందికి పైగా బందీలలో ఇరవై మూడు మంది థాయ్‌లు ఉన్నారు. మరో ఎనిమిది మంది హమాస్ చెరలో ఉన్నారని ఇజ్రాయిల్ చెబుతోంది. వారిలో ఇద్దరు మరణించినట్లు అనుమానిస్తున్నారు. ఇజ్రాయిల్ నేడు 110 మంది ఖైదీలను విడుదల చేయనున్నట్లు సమాచారం.

# అమెరికాలో హెలికాప్టర్‌ను ఢీకొట్టిన విమానం

**వాషింగ్టన్:** అమెరికాలో ప్రయాణికులతో వెళ్తున్న విమానం హెలికాప్టర్‌ను ఢీకొట్టింది. వాషింగ్టన్ డీసీలో స్థానిక సమయం 2 గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగింది. ఢీకొన్న తర్వాత శిథిలమైన విమానం పోటోమాక్ నదిలో పడిపోయింది. ఈ ప్రమాదం రోనాల్డ్ రీగన్ జాతీయ విమానాశ్రయం సమీపంలో జరిగింది. ప్రయాణికుల విమానం ల్యాండ్ అవుతుండగా హెలికాప్టర్‌ను ఢీకొట్టింది. విమానంలో 60 మంది ప్రయాణికులు, నలుగురు సిబ్బంది ఉన్నారు. అమెరికన్ ప్రాంతీయ విమానయాన సంస్థ పిఎస్ఎ ఎయిర్‌లైన్స్‌కు చెందిన బాంబార్డియర్ సి.ఆర్.జె 700 జెట్ సిరోస్కీ హెచ్-60 ??హెలికాప్టర్‌ను ఢీకొట్టింది. అమెరికన్ ఎయిర్‌లైన్స్ విమానం కాన్సాస్‌లోని విచిటా నుండి బయలుదేరింది. విమానం నదిలో కూలిపోయిన తర్వాత ప్రయాణికుల కోసం శోధిస్తున్నారు. ప్రమాదానికి కారణం అస్పష్టంగా ఉంది. ప్రమాదం కారణంగా రోనాల్డ్ రీగన్ విమానాశ్రయం నుండి విమాన సేవలు నిలిపివేయబడ్డాయి.

# ఎల్ఓసి వద్ద ఎన్‌కౌంటర్ ఇద్దరు ఉగ్రవాదుల మృతి

**కశ్మీర్ :** జమ్మూకశ్మీర్‌లోని పూంచ్ జిల్లాలోని నియంత్రణ రేఖ (ఎల్ఓసి) దాటి చొరబడటానికి ఉగ్రవాదులను ప్రయత్నాలను భద్రతా దళాలు అడ్డుకున్నాయి. చొరబాటు యత్నించిన భారీగా ఆయుధాలు ధరించిన ఇద్దరు ఉగ్రవాదులు మరణించారని అధికారులు శుక్రవారం తెలిపారు. ఈ సంఘటన గురువారం పూంచ్ జిల్లాలోని ఖరీ కర్మారా ప్రాంతంలో జరిగిందని వారు తెలిపారు. ఈ ఉదయం చివరి నివేదికలు అందినప్పుడు భారీ శోధన ఆపరేషన్ జరుగుతోందిని వారు తెలిపారు. పూంచ్ సెక్టార్‌లోని నియంత్రణ రేఖ వద్ద గురువారం రాత్రి ఉగ్రవాద కదలికను గుర్తించారు. అప్రమత్తమైన దళాలు చొరబడిన ఉగ్రవాదులతో వేగంగా వ్యవహరించాయి. ఇది తీవ్రమైన, భారీ కాల్పులకు దారితీసిందని సైన్యం యొక్క జమ్మూకు చెందిన వైట్ నైట్ కార్ప్స్ ఎక్స్ లో ఒక పోస్ట్‌లో తెలిపింది. ఈ ఆపరేషన్ రాత్రంతా కొనసాగిందని, దీనివల్ల ఇద్దరు ఉగ్రవాదులు మట్టుబెట్టబడ్డారని సైన్యం తెలిపింది. ఇప్పటివరకు ఈ ప్రాంతంలో జరిపిన శోధనలో అనేక ఆయుధాలు, యుద్ధానికి అనువైన నిల్వాలు కనుగొనబడ్డాయని ఆర్మీ అధికారులు తెలిపారు.

# పంజాబ్ సిఎం నివాసంలో ఇసి సోదాలు



**న్యూఢిల్లీ :** మరికొన్ని రోజుల్లో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగనుండగా దేశ రాజధాని ఢిల్లీలోని పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్‌సింగ్‌మాన్‌కు చెందిన నివాసంలో గురువారం ఎన్నికల కమిషన్ (ఇసి) అధికారులు సోదాలు నిర్వహించడం సంచలనంగా మారింది. కోపర్నికస్ మార్గ్‌లో ఉన్న కపుర్తలా హౌస్‌లో ఈ సోదాలు జరిగాయి. ఎన్నికల్లో ప్రలోభాలకు గురిచేయడం కోసం నగదు పంపిణీ జరిగిందనే ఫిర్యాదు రావడంతో సోదాలు జరుపుతున్నట్లు ఒక అధికారి విలేకరులకు తెలిపారు. ఎన్నికల కమిషన్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యులతో పాటు ఢిల్లీ పోలీసులు కూడా సోదాల్లో పాల్గొన్నారు. పంజాబ్ ప్రభుత్వ స్టిక్కర్‌తోపాటు ఆ రాష్ట్ర రిజిస్ట్రేషన్ నంబర్‌ను కలిగి ఉన్న ఒక ప్రైవేట్ వాహనాన్ని ఢిల్లీ పోలీసులు స్వాధీనం చేసుకున్న ఒక రోజు తరువాత ఈ సోదాలు జరగడం గమనార్హం. పంజాబ్ భవన్ సమీపంలో స్వాధీనం చేసుకున్న వాహనంలో మద్యం, నగదు, ఆప్ ఎన్నికల ప్రచార సామాగ్రి ఉన్నాయని ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ సోదాలను ఆప్ తీవ్రంగా ఖండించింది.

# జన్మతః పౌరసత్వం బానిస పిల్లల కోసమే

**వాషింగ్టన్:** జన్మతః పౌరసత్వం లభించే హక్కును అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ రద్దు చేసిన విషయం తెలిసిదే. ఇది కాస్తా వివాదాస్పదం కావడంతో న్యాయస్థానం ఆ ఉత్తర్వులను నిలిపివేసింది. ఈక్రమంలోనే తాజాగా ట్రంప్ దీనిపై స్పందించారు. బానిసల పిల్లల కోసమే తొలినాళ్లలో జన్మతః పౌరసత్వాన్ని తీసుకొచ్చారని అన్నారు. ఒకసారి గతాన్ని గుర్తుచేసుకుంటే, బానిసల పిల్లలకు హక్కులు కల్పించాలనే ప్రాథమిక ఉద్దేశంతో జన్మతః పౌరసత్వాన్ని అప్పట్లో ఆమోదించారు. అంతేగానీ ప్రపంచ జనాభా మొత్తం వచ్చి అమెరికాలో పోగుపడటం కోసం ఆ చట్టాన్ని తీసుకురాలేదు. చాలామంది మన దేశానికి వస్తున్నారు. అర్హత లేని వ్యక్తులు ఈ చట్టాన్ని ఉపయోగించుకుంటున్నారు. దీంతో అర్హత లేని పిల్లలకు పౌరసత్వం లభిస్తోంది. ఈ చట్టం అందుకోసం కాదు. చాలా గొప్ప ఉద్దేశంతో బానిసల పిల్లల కోసం తీసుకొచ్చినది అని తెలిపారు. దీనిపై తాను సుప్రీంకోర్టుకు వెళ్తానని చెప్పారు. అక్కడ తమకు అనుకూలంగా తీర్పు వస్తుందని వంద శాతం విశ్వాసంతో ఉన్నట్లు వెల్లడించారు.

# పరువునష్టం కేసు విచారణ వాయిదా



**న్యూఢిల్లీ:** లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై పరువు నష్టం కేసు విచారణ గురువారం వాయిదా పడింది. ఆయన తరపు న్యాయవాది అస్వస్థతకు గురికావడంతో ఈ కేసు తదుపరి విచారణను ఫిబ్రవరి 11కి వాయిదా వేస్తున్నట్లు ప్రత్యేక న్యాయమూర్తి శుభమ్‌వర్మ పేర్కొన్నారు. 2018 కర్ణాటక ఎన్నికల సమయంలో రాహుల్ గాంధీ కించపరిచే వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ బిజెపి నేత పరువు నష్టం కేసు దాఖలు చేశారు. రాహుల్ వ్యాఖ్యలు అభ్యంతరకరమని, తనకు వ్యక్తిగతంగా హాని కలిగించాయని పేర్కొన్నారు. రాహుల్ కోర్టుకు హాజరుకాకపోవడంతో, 2023 డిసెంబర్‌లో ఆయనపై అరెస్ట్ వారెంట్ జారీ అయింది. 2024 ఫిబ్రవరిలో రాహుల్ కోర్టులో లొంగిపోయారు. అదే ఏడాది జులై 26న కోర్టు ఆయన స్టేట్ మెంట్‌ను రికార్డు చేసింది. రూ.25,000 చొప్పున ఇద్దరి పూచీకత్తుపై బెయిల్ మంజూరైంది. ఈ కేసు రాజకీయ కుట్రలో భాగమని రాహుల్ గాంధీ వాదిస్తున్న సంగతి తెలిసిందే.

# ఆశాలకు చట్టబద్ధమైన హక్కులు కల్పించాలి



**న్యూఢిల్లీ :** నిజాయితీగా సేవలందిస్తున్న ఆశా వర్కర్లు కేవలం గౌరవానికే కాకుండా చట్టబద్ధమైన హక్కులతో గౌరవప్రదమైన జీవితాన్ని పొందేందుకు కూడా అర్హులని ఆశా వర్కర్స్ అండ్ ఫెసిలిటేటర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎడబ్ల్యుఎఫ్ఎఫ్ఐ) ప్రధాన కార్యదర్శి మధుమిత బందోపాధ్యాయ పేర్కొన్నారు. దేశ రాజధానిలో ఇటీవల జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకలకు ప్రత్యేక అతిథులుగా ఆశావర్కర్లను ఆహ్వానించి, వారు చేసిన సేవలకు గౌరవం కల్పించినందుకు కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శికి, భారత ప్రభుత్వానికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జె.పి.నడ్డాకు మధుమిత బహిరంగ లేఖ రాశారు. వివిధ రాష్ట్రాలకు చెందిన 250మంది ఆశా వర్కర్లు వారి భాగస్వాములతో కలిసి గణతంత్ర దినోత్సవాల్లో ప్రత్యేక అతిథులుగా పాల్గొన్నారు. పైగా దేశ ఆరోగ్య రంగానికి ఆశా వర్కర్లు వెన్నెముక వంటివారని, మహిళా సాధికారతకు నిలువెత్తు రూపమని ఆరోగ్య కార్యదర్శి పత్రికా సమావేశంలో పేర్కొనడం చాలా సంతోషాన్ని కలిగించిందని ఆమె తెలిపారు. టిబి నిర్మూలన కోసం వారు చేసే పోరాటం, ప్రసూతి, శిశు సంరక్షణ రంగాల్లో వారి కృషి కొనియాడదగినదని వివరించారు. కరోనా సమయంలో కూడా వారు అంకితభావంతో చేసిన కృషిని డబ్ల్యుహెచ్ఓ ప్రశంసించిందని, వారిని గ్లోబల్ లీడర్లుగా గౌరవించిందని పేర్కొన్నారు. ప్రస్తుతం దేశంలో పది లక్షల మందికిపైగా ఆశా వర్కర్లు పనిచేస్తున్నారు. నిజాయితీగా సేవలందిస్తున్న వీరు కేవలం గౌరవాన్నే కాకుండా చట్టబద్ధమైన హక్కులతో గౌరవప్రదమైన జీవితాన్ని పొందేందుకు అర్హులని ఆమె పేర్కొన్నారు. అంటువ్యాధులు ప్రబలిన సమయంలోకూడా ప్రజలతో మమేకమై విధులు నిర్వహించిన వీరికి తగిన భద్రత కొరవడడం, పైగా వారిని ఉద్యోగులు లేదా కార్మికులుగా కూడా గుర్తించకపోవడం సిగ్గుచేటైన విషయమని ఆ లేఖ విమర్శించింది. వారిని వలంటీర్లుగా పరిగణిస్తూ, ప్రోత్సాహకాల పేరుతో నెలకు రూ.2వేలు చెల్లించడం దారుణమైన విషయమని విమర్శించింది. వారికి ఆరోగ్య బీమా లేదని, పైగా ప్రసూతి సెలవు లేదని, సామాజిక భద్రత కొరవడిందని ఆ లేఖ పేర్కొంది.

# చండీగఢ్ విద్యుత్ ఉద్యోగులపై ఎస్మా




**చండీగఢ్ :** సమ్మె చేస్తున్న చండీగఢ్ విద్యుత్‌శాఖ ఉద్యోగులపై హర్యానా అత్యవసర సేవల (నిర్వహణ) చట్టం %-% ఎస్మాను ప్రభుత్వం ప్రయోగించింది. ఈ చర్యను సిపిఎం తీవ్రంగా ఖండించింది. ఎస్మాను తక్షణమే ఎత్తివేయాలని, ప్రైవేటీకరణను ఆపాలని డిమాండ్ చేసింది. కేంద్రపాలిత ప్రాంతమైన చండీగఢ్ ప్రభుత్వ పరిధిలోని విద్యుత్ పంపిణీ విభాగాన్ని ప్రైవేటు రంగంలోని ఎమినెంట్ ఎలక్ట్రిసిటీ డిస్ట్రిబ్యూషన్ లిమిటెడ్ (ఇఇడిఎల్)కు ఫిబ్రవరి మొదటి వారంలో అప్పగించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి వ్యతిరేకంగా సాగుతున్న ఎలక్ట్రిసిటీ ఉద్యోగులు గత యాభై రోజులుగా కొనసాగిస్తున్న సమ్మెను అణచివేసేందుకు ఎస్మాను ప్రయోగించింది. రూ.250 కోట్ల వార్షిక లాభం ఉన్న సంస్థను రూ.174.63 కోట్లకు వేలం వేశారు. దీనిలో భారీ అవినీతి చోటుచేసుకుందని కార్మిక, రైతు సంఘాలు విమర్శిస్తున్నాయి.ప్రైవేటు కంపెనీకి తమ విభాగం బదిలీ అయిన రోజు నుండే తాము విధులను బహిష్కరిస్తామని యుటి పవర్‌మెన్ యూనియన్ హెచ్చరించింది. యూనియన్ ప్రధాన కార్యదర్శి గోపాల్ దత్ జోషి మాట్లాడుతూ, ప్రైవేటు కంపెనీకి బదలాయించబడే ఉద్యోగులకు ఎలాంటి విధానం ప్రకటించకుండా, వారికి ఒక అవకాశం ఇవ్వకుండా ఏకపక్షంగా ఈ చర్య చేపట్టారని విమర్శించారు. అత్యధిక లాభాలనార్జించే, సమర్థవంతమైన, తక్కువ టారిఫ్‌లు గల ఈ విద్యుత్ సంస్థను ప్రైవేటీకరించడానికి ప్రభుత్వం పూనుకోవడంపై చండీగఢ్ అంతటా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. చండీగఢ్ విద్యుత్ ఉద్యోగులపై విధించిన ఎస్మాను తక్షణమే ఎత్తివేయాలని అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) డిమాండ్ చేసింది.

# రాష్ట్ర విభజన హామీలు అమలు కాలేదు



**న్యూఢిల్లీ :** రాష్ట్ర విభజన హామీలు ఇంకా పూర్తిగా అమలు కాలేదని టిడిపి రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు అన్నారు. గురువారం అఖిలపక్ష సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర విభజనలో పోలవరం నిర్మాణం, రాజధానికి నిధులు, ప్రత్యేక హోదా ఇతర సహాయం అందించాలని కేంద్రాన్ని కోరినట్లు చెప్పారు. రాష్ట్ర అంశాలపై చర్చించేందుకు లోక్‌సభలో సమయం ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులను సాధిస్తామని, రాష్ట్రం నుంచి ఉన్న ఎంపిలు సైతం సహకరించాలని అన్నారు. టిడిపి లోక్‌సభ పక్ష ఉపనేత దగ్గుమల్ల ప్రసాదరావు మాట్లాడుతూ.. రాష్టానికి సంబంధించిన పెండింగ్ అంశాలను పూర్తి చేయాలని కోరినట్లు చెప్పారు. రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన్ హామీలను నెరవేర్చాలని కోరినట్లు తెలిపారు. రెండు రాష్ట్రాల మధ్య సమస్యలను పరిష్కరించాలని జనసేన ఎంపి వల్లభనేని బాలశౌరి కోరారు. రాష్ట్ర విభజన జరిగి ఇన్నేళ్లయినా ఇంకా రెండు తెలుగు రాష్ట్రాల మధ్య అనేకాంశాలు అపరిష్కృతంగా ఉన్నాయన్నారు. వాటిపై కేంద్ర ప్రభుత్వం దృష్టి పెట్టి పరిష్కరించాలని కోరినట్లు చెప్పారు. పోలవరం, అమరావతి, విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ సహా రాష్ట్రానికి సంబంధించిన అంశాలపై లేవనెత్తామని అన్నారు. ఎపి నుంచి ఖాళీ అయిన రాజ్యసభ సీటు గురించి మూడు పార్టీల పెద్దలు కూర్చుని నిర్ణయం తీసుకుంటారని తెలిపారు.

# మన వెలుగు కథనానికి స్పందన

## - గోదావరి నదిని శుభ్రపరుచుకుందాం రండి
## - బీజేపీ కార్యకర్తలకు ఎమ్మెల్యే పిలుపు

**బాసర (మన వెలుగు) జనవరి 31 :** జనవరి 7న మన వెలుగు' దినపత్రికలో ముందస్తుగా నదిలో పేరుకుపోయిన చెత్త గురించిన కథనం వచ్చినా కూడా సంబంధిత సిబ్బంది స్పందించకపోగా స్వయంగా ఎమ్మెల్యే గారు స్పందించి వసంత పంచమి వేళ ప్రభుత్వం ఏర్పాట్లు చేయకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. హిందువుల పండుగలపై ఇంత వివక్ష ఎందుకని ప్రభుత్వ తీరును మార్చుకోవాలని హెచ్చరించారు. బాసర జ్ఞాన సరస్వతి అమ్మవారి సన్నిధిలో వసంత పంచమి ఏర్పాట్లలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు రోజుల నుండి అధికారులకు ప్రభుత్వానికి విన్నవిస్తున్నప్పటికీ గోదావరి ఘాట్లను శుభ్రపరచకపోవడంతో అసంతృప్తికి లోనయ్యారు. హిందువుల పండుగ అంటే ప్రభుత్వానికి ఎందుకంత వివక్షో అర్థం కావడం లేదన్నారు. భక్తులు పుణ్య స్థానాలు ఆచరించే పవిత్ర జలం అపరిశుభ్రతతో ఉంటే ఎలా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అన్ని




### గోదావరి జల శుద్ధికి దారేది

**బాసర (మన వెలుగు) జనవరి 06 :** భారతదేశంలోనే ప్రసిద్ధ క్షేత్రమైన శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులు గోదావరి నదిలో స్నానం ఆచరించి వాటినే పవిత్ర నీటిగా భావించి వారి నివాసల్లోకి తీసుకెళ్లడం ఆనవాయితీ. అలాంటి పవిత్ర గోదావరి నది అంచుల నిండా ప్లాస్టిక్ మరియు కొబ్బరి పీచులతో నీటి కాలుష్యం జరుగుతున్న అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్టుగా ఉండటం ఏమిటని భక్తులు ప్రశ్నిస్తున్నారు. తక్కువ భక్తులు సందర్శించినప్పుడే పరిస్థితి ఈ విధంగా ఉంటే.. వచ్చే సంక్రాంతి సెలవులకు భారీగా దర్శనానికి వచ్చే అవకాశం ఉన్నందున అధికార యంత్రాంగం ఇప్పటికైనా స్పందించి నదీ పరివాహక జలాలను శుద్ధి చేయాల్సిందిగా కోరుచున్నారు.

ఏర్పాట్లు చేయాలన్నారు. రేపు ఉదయం 9 గంటలకు బాసర అమ్మవారి క్షేత్రంలో గోదావరి నది స్నాన ఘట్టాల వద్ద స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని చేపట్టనున్నామని పెద్ద మొత్తంలో బీజేపీ కార్యకర్తలు తరలిరావాలన్నారు. స్వచ్ఛభారత్ ఘట్లను పరిశుభ్రం చేద్దామన్నారు. అనంతరం ప్రభుత్వ తీరుపై శాంతియుతంగా నిరసన తెలుపుతామన్నారు.

# ప్రజా యుద్ధనౌక గద్దర్ గురించి మాట్లాడే స్థాయి బండి సంజయ్ కి లేదు

**కుత్బుల్లాపూర్ (మన వెలుగు) జనవరి 31 :** గద్దర్ 76వ జయంతి సందర్భంగా నేడు జగద్గిరిగుట్ట చివరి బస్ స్టాప్ అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఐ మరియు ప్రజా సంఘాల నాయకులు గద్దర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా యుద్ధ నౌక గద్దర్ ఈ ఉమ్మడి రాష్ట్రంలో పేద ప్రజల కోసం అనేక పోరాటాలు నిర్వహించినటువంటి చరిత్ర, అదేవిధంగా తెలంగాణ మలిదశ, చివరి దశ ఉద్యమంలో కూడా శరీరంలో తూటాను లెక్కచేయకుండా రాష్ట్రవ్యాప్తంగా కాళ్లకు గజ్జలు కట్టుకొని, గోచి గొంగడి తో ప్రతి పల్లెలో ప్రజలకు యువకులను, విద్యార్థులను, కార్మికులను సబ్బండ వర్గాలను తెలంగాణ ఉద్యమంలో పాల్గొనేటట్టు చేసిన గొప్ప చరిత్ర గద్దర్ ఉందని, అలాంటి గద్దర్ కి పద్మశ్రీ అవార్డు లాంటి అనేక అవార్డులు తన స్థాయికి సరిపోవని ప్రజలే వారికి ప్రజాయుద్ధనౌకాని పేరు పెట్టి సత్కరించుకున్నారని, గద్దర్ ఈ దేశ ప్రధాని అయినటువంటి మోడీ తన చనిపోయినప్పుడు సంతాపం తెలియజేసిందని, అదేవిధంగా అనేక సభలు సమావేశాలలో బిజెపి నాయకులు గద్దర్ గౌరవించుకున్నారని, అది తెలుసుకోకుండా గద్దర్ పై మాట్లాడటం సమంజసం




కాదని, ఇది తెలంగాణ ఉద్యమాన్ని, ఉద్యమకారులను అవమానించడమేనని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కార్యవర్గ సభ్యులు హరినాథ్, ప్రజానాట్యమండలి అధ్యక్షులు ప్రవీణ్, డిహెచ్పిఎస్ రాష్ట్ర నాయకులు రాములు, దుర్గయ్య, వెంకటేష్, ప్రజానాట్యమండలి అధ్యక్షుడు బాబు,ఎం జె ఎఫ్ జిల్లా కార్యదర్శి యాకయ్య, లాలయ్య , సోమన్న, ప్రభాకర్, సామిల్,ముసలయ్య, రవి,యాదగిరి, బాబు,జర్నలిస్టు నాయకులు తొండ వెంకట్, గణేష్, స్వామి తదితరులు పాల్గొనడం జరిగింది.

# రబింద్రా విద్యార్థుల క్షేత్రసందర్శన

**ముధోల్ (మన వెలుగు) జనవరి 31 :** మండల కేంద్రమైన ముధోల్ లోని రబింద్ర పాఠశాలలోని విద్యార్థులు తానూర్ మండలంలోని బొంద్రట్ గ్రామంలో గల సేంద్రియ వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. సేంద్రీయ వ్యవసాయ క్షేత్రాన్ని సాయినాథ్ నిర్వహస్తునారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ ఆసంవార్ సాయినాథ్ మాట్లాడుతూ బోంద్రట్ గ్రామంలో నిర్విహస్తున్న సేంద్రియ వ్యవసాయక్షేత్రాన్ని-గోశాలను సందర్శించామని, మమల్ని కుటుంబసమేతంగా షిందే సాయినాథ్ ఆహ్వానించారని, అతని గోశాలలో చాలా రాష్ట్రాల నుంచి తెచ్చిన దేశి ఆవులున్నాయని, సమృద్ధిగా పాలు ఇస్తాయని పేర్కొన్నారు వ్యవసాయ భూమిలో తొమ్మిది సంవత్సరాల నుండి ఎటువంటి రసాయనాలను ఉపయోగించకుండ వ్యవసాయం చేస్తున్నరని పసుపు పంట-గోదుమ పంట-పండ్ల తోటలు అద్భుతంగా ఉన్నాయని, వారి ఇంటికి సరిపడ అన్ని రకాలు పండించుకుంటున్నారని వెల్లడించారు. వర్షపు నీటిని నిలువచేసి సంవత్సరమంత



త్రాగునీరుగా ఉపయోగిస్తున్నారని, వారి ఇంటి వద్ద అనేక రకాల తీగ జాతులున్నాయని, వారు ధరించే కుంకుమతో పాంటు అన్ని తయారు చేసుకుంటారని తెలిపారు. అందరు ఈ విధమైన వ్యవసాయ పద్ధతులు పాటిస్తే అందరిక మంచిదని అనారోగ్యం బారిన పడరని అన్నారు. తర్వాత వారికి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు

# జాతీయ రహదారిపై తండావాసుల ఆందోళన

**ముధోల్ (మన వెలుగు) జనవరి 31 :** ముధోల్ మండలం తరోడా గ్రామపంచాయతీ పరిధిలోని తరోడా తండా ప్రజలు బాసర-బైంసా జాతీయ రహదారిపై ఆందోళన చేపట్టారు. గ్రామానికి జాతీయ రహదారి యూటర్న్ ఇవ్వాలని రోడ్డుపై కూర్చొని ధర్నా చేపట్టారు. యూటర్న్ దూరంగా ఉండడంతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదన్నారు. యూటర్న్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జాతీయ రహదారిపై ఆందోళన చేపట్టడంతో ట్రాఫిక్కు కొద్దిసేపు అంతరాయం ఏర్పడింది. వివిధ గ్రామాల నుండి వచ్చే తండ ప్రజలకు ఆర్టీసీ బస్సులు సైతం ఆపడం లేదన్నారు. అదేవిధంగా తండా నుండి జాతీయ రహదారి వరకు నిర్మిస్తున్న రోడ్డు పనులు అసంపూర్తిగా ఉన్నయని త్వరితగతిన రోడ్డు పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ముధోల్ సిఐ జి. మల్లేష్, ఎస్సై సంజీవ్ కుమార్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి వచ్చి ఆందోళనకారులను సముదాయించారు. అదేవిధంగా మాజీ జడ్పిటిసి లక్ష్మి నర్సగౌడ్ సైతం ఆందోళన చేస్తున్న విషయాన్ని తెలుసుకుని ప్రజలుతో మాట్లాడారు. విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించినందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో తండావాసులు ఆందోళన విరమించారు.

# సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

## - రహదారి భద్రత మన అందరి బాధ్యత
## - రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం
## - జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్

**ములుగు ప్రతినిధి (మన వెలుగు) జనవరి 31:** సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, రహదారి భద్రత మన అందరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు.శుక్రవారం జిల్లా కేంద్రం లోని రవాణా శాఖ కార్యాలయం నుంచి జాతీయ రోడ్డు భద్రతా మసోత్సవం ముగింపు సందర్భంగా రహదారి సురక్ష అభియాన్-శ్రద్ధ రోడ్డు భద్రత అవగాహన ర్యాలీని జిల్లా కలెక్టర్ దివాకర టి. ఎస్. జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అన్నారు. రహదారి భద్రత మన అందరి బాధ్యత సమాజిక బాధ్యతగా రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలు రక్షించాలని అన్నారు. రోడ్డు భద్రత మాసోత్స వాలు జనవరి 1 నాడు ప్రారంభించిడం జరిగిందన్నారు. జిల్లాలో రవాణా శాఖ అధికారులు, ట్రాఫిక్ రూల్స్ పై ప్రజలకు




అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు.ప్రచారం సామాజిక బాధ్యతగా రోడ్డు భద్రత లో ప్రజలు భాగస్వా మ్యం అయితే ప్రమాదాలు నివారించ వచ్చని ఆయన తెలిపారు. వాహనాలను అందరూ జాగ్రత్తగా నడపాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్ సంబంధిత అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# బాసరలో ఘనంగా వసంత పంచమి వేడుకల నిర్వహించాలి

## - జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**బాసర (మనవెలుగు ) జనవరి 31 :** వసంత పంచమికి బాసరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం బాసరలో పర్యటించిన కలెక్టర్ వసంత పంచమి వేడుకలకు సంబంధించి ఏర్పాట్లను పరిశీలించారు. ముందుగా గోదావరి పుష్కర ఘాట్ ను అధికారులతో కలిసి పరిశీలించారు. గోదావరి పుష్కర ఘాట్ ప్రదేశంలో నిరంతరం పారిశుద్ధ్య కార్యక్రమాలు కొనసాగించాలన్నారు. ఎప్పటికప్పుడు బ్లీచింగ్ పౌడర్ ను చల్లాలని సూచించారు. గోదావరి నదిలో స్నానమాచరించిన భక్తులు దుస్తులు మార్చుకునేందుకు వీలుగా అవసరమైన గదులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నది వద్ద గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలని తెలిపారు. రాత్రి వేళల్లో ఇబ్బందులు కలగకుండా అవసరమైన విద్యుత్ దీపాలను అమర్చాలని సూచించారు. అనంతరం బాసర శ్రీ జ్ఞాన సరస్వతి దేవి అమ్మవారిని కలెక్టర్ దర్శించుకున్నారు. ఆలయ పూజారులు కలెక్టర్ కు స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం వి ఐ పి గెస్ట్ హౌస్ లో అధికారులతో కలిసి వసంత పంచమి వేడుకల నిర్వహణపై కలెక్టర్ సమావేశం నిర్వహించారు. బాసరలో ఫిబ్రవరి 1 నుండి 3 వరకు వసంత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వేడుకల పర్యవేక్షణకు భైంసా ఆర్డిఓ ను ప్రత్యేక అధికారిగా నియమించినట్లు తెలిపారు. వసంత పంచమికి బాసరకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. భక్తుల రద్దీని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ దర్శనానికి అనుమతించాలన్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బంది కలగకుండా త్రాగునీరు, బయోటాయిలెట్ లను ఏర్పాటు చేయాలన్నారు. నిరంతరం పారిశుద్ధ్య కార్యక్రమాలను కొనసాగిస్తూ పరిశుభ్రతను పాటించాలన్నారు. శిశువులకు పాలిచ్చేందుకు వీలుగా బేబీ ఫీడింగ్ గదులను ఏర్పాటు చేయాలన్నారు. గోదావరి పుష్కర ఘాట్, ఆలయ పరిసరాలన్నీ సీసీ కెమెరాలు పర్యవేక్షణలో ఉంచాలన్నారు. ఆలయం



సమీపంలో 108, అంబులెన్స్, అగ్నిమాపక యంత్రాలని అందుబాటులో ఉంచి ఎటువంటి వాంఛనీయ ఘటనలు ఏర్పడకుండా జాగ్రత్త వహించాలన్నారు. వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి, వైద్యులను, అత్యవసర మందుల్ని అందుబాటులో ఉంచాలన్నారు. కంట్రోల్ రూమ్, హెల్ప్ డెస్క్ లను ఏర్పాటు చేయాలని సూచించారు. రైల్వే స్టేషన్, బస్టాండ్ ల నుండి భక్తులు ఆలయానికి సులువుగా చేరుకునే విధంగా రోడ్డు మార్గాన్ని తెలిపే విధంగా బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. ఆలయంలో ప్రవేశం, నిష్క్రమణ, త్రాగునీరు, మరుగుదొడ్ల వివరాలు తెలిపే విధంగా సూచన బోర్డులను ఏర్పాటు చేయాలని తెలిపారు. పార్కింగ్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పోలీసు శాఖ సమన్వయంతో పటిష్ట బందోబస్తు చేపట్టాలన్నారు. ఆలయాన్ని అందమైన పూలు, లైటింగ్ తో అలంకరించాలని సూచించారు. రెవెన్యూ, పోలీస్, పంచాయతీ రాజ్, దేవాదాయ శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వసంత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్ డి ఓ కోమల్ రెడ్డి, బాసర దేవాలయ ఈవో సుధాకర్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, ఆర్ అండ్ బి ఈఈ అశోక్ కుమార్, మిషన్ భగీరథ సందీప్, తహసిల్దార్ పవన్ చంద్ర, రెవెన్యూ, పోలీస్, పంచాయతీ, దేవాదాయ శాఖల అధికారులు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


# చించాలలో కొనసాగుతున్న అఖండ హరినామ సప్తాహ

**ముధోల్ (మన వెలుగు) జనవరి 31:** ముధోల్ మండలం చించాల గ్రామంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అఖండ హరినామ సప్తహ కొనసాగుతుంది. సప్తహలో భాగంగా కాగడ హారతులతో గ్రామంలోని ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. శనివారం రోజున అఖండ హరినామ సప్తహ ముగుస్తుందని పేర్కొన్నారు. గత 25 సంవత్సరాల నుండి గ్రామస్తులు ఐక్యంగా సప్తహను నిర్వహిస్తూన్నారు. గ్రామంలోని ప్రజల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించడంలో అఖండ హరినామ సప్తహ కీలకంగా మారుతుందన్నారు. భక్తులు ఉదయం సాయంత్రం సమయాల్లో హారతులతో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.



పవిత్ర గ్రంథాల పారాయణం చేస్తూ ప్రజలకు సారాంశాన్ని వివరిస్తున్నారు.

## ఇది ప్రజా ప్రభుత్వం అర్హులకు న్యాయం చేస్తాం



**ముధోల్ (మన వెలుగు) జనవరి 31 :** భైంసా పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బాధితులకు ముధోల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ మాజీ శాసనసభ్యులు బోస్లే నారాయణ్ రావు పటేల్ పంపిణీ చేశారు. బాధితులు సిఎం రేవంత్ రెడ్డి-ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్కకి ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో లోకేశ్వరం యూత్ అధ్యక్షులు సుదర్శన్ రెడ్డి, ముధోల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు మహ్మద్ షఫీ. రావుల శ్రీనివాస్, ఓం ప్రకాష్, శ్రీనివాస్, నరేందర్, మాజీ సర్పంచ్ ప్రకాష్, సదాశివ్ పటేల్, బాధితులు పాల్గొన్నారు.


## కుంభమేళాలో నలుగురు మిస్సింగ్

**ముధోల్ (మన వెలుగు ) జనవరి 31 :** ఇటీవల కుంభమేళాకు వెల్లిన పలువురు తప్పిపోయిన నలుగురు మహిళలు 55 సంవత్సరాల పై వారే ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ఆందోళనలో కుటుంబ సభ్యులు తప్పిపోయిన వారిలో విద్యానగర్ కు చెందిన నరసవ్వ (55), కొత్త వాడకు చెందిన రాజవ్వ (55) మరో ఇద్దరు కుటుంబ సభ్యులు నిర్మల్ జిల్లా కడెంకు చెందినవారు కడెంకు చెందిన బుచ్చవ్వ (65), సత్తవ్వ (55) మరికొద్ది మంది సైతం తప్పిపోయినట్టు సమాచారం ఈ నెల 29న కుంభమేళాకు చేరుకున్న మహిళలు ఒకేసారి వెల్లిన 11 మంది మహిళలు.




## జీలకర్ర ఆరోగ్యానికి ఎంత మేలు చేస్తుందంటే...?

మనకు ఎల్లప్పుడూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే ఖచ్చితంగా ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలి. అందులో ఈ జీలకర్ర కూడా ఖచ్చితంగా ఒకటి. దీనివల్ల ఎన్నో లాభాలు వున్నాయి. జీలకర్ర గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఇది దాదాపు ప్రతి భారతీయ ఆహారాలలో వాడే మసాలా. అయితే ప్రతిరోజూ ఉదయాన్నే ఖాళీ కడుపుతో జీలకర్రను తీసుకోవడం వల్ల ఖచ్చితంగా చాలా ప్రయోజనాలను పొందవచ్చు. ఈ జీలకర్రలో ఐరన్, కాపర్, కాల్షియం, పొటాషియం, మాంగనీస్, జింక్, మెగ్నీషియం, ఫైబర్ వంటి ఎన్నో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. అలాగే దీన్ని తీసుకోవడం వల్ల మీరు కండరాల నొప్పి, శరీరం వాపు నుండి ఈజీగా బయటపడతారు. ఇంకా అంతే కాదు, ఇది బరువు తగ్గించడంలో, మీ చర్మాన్ని మెరిసేలా చేయడంలో కూడా చాలా బాగా సహాయపడుతుంది. ఈ జీలకర్ర (జీరా హెల్త్ బెనిఫిట్స్) తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి ఇప్పుడు మనం తెలుసుకుందాం. మీ శరీరంలో చెడు కొలెస్ట్రాల్ కనుక పేరుకుపోయినట్లయితే, మీరు ప్రతిరోజూ జీలకర్ర ఖచ్చితంగా తీసుకోవాలి. దీనివల్ల మీ శరీరంలో ఉండే చెడు కొలెస్ట్రాల్ క్రమంగా తగ్గడం ప్రారంభమవుతుంది. మీరు బరువు తగ్గడం సులభం అవుతుంది. అలాగే మీకు జీర్ణక్రియకు సంబంధించిన సమస్యలు ఉంటే, మీరు ప్రతిరోజూ ఖచ్చితంగా ఖాళీ కడుపుతో జీలకర్రను తినాలి. ఇది అజీర్ణం, గ్యాస్ ఇంకా మలబద్ధకం వంటి



సమస్యల నుండి మిమ్మల్ని ఖచ్చితంగా దూరంగా ఉంచుతుంది. ఇంకా అదే సమయంలో, జీలకర్ర మీ జీవక్రియను వేగవంతం చేయడంలో కూడా చాలా బాగా సహాయపడుతుంది. ఇంకా ఈ జీలకర్రలో యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు చాలా పుష్కలంగా ఉన్నాయి. అందుకే ఇది మీ చర్మాన్ని అన్ని రకాల ఇన్ఫెక్షన్ల నుండి రక్షించడంలో చాలా బాగా సహాయపడుతుంది. అందువల్ల మీ చర్మం ఆరోగ్యంగా ఇంకా మెరుస్తూ ఉంటుంది. కాబట్టి ఖచ్చితంగా ఈ జీలకర్ర తీసుకోండి. ఎల్లప్పుడూ ఎలాంటి రోగాలు రాకుండా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండండి.

## తేగలతో అద్భుత ఆరోగ్య ప్రయోజనాలు..!

తేగల్లో ఏం పోషకాలు ఉంటాయి..? ఈ తేగల్ని మహిళలు తప్పనిసరిగా ఎందుకు తినాలి..? డయాబెటీస్ బాధితులు తేగలను తినొచ్చా..? తేగలు అతిగా తింటే ఏం జరుగుతుంది.. పెద్దలు తేగలు గురించి చెప్పే విషయాలు నిజమేనా...? తేగలకు సంబంధించిన అద్భుత ఆరోగ్య ప్రయోజనాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం. తేగల్లో విటమిన్ దీ, విటమిన్ జ అధికంగా ఉంటాయి. 100 గ్రాముల తేగల్లో 87 కిలో క్యాలరీలతో పాటు 77 గ్రాముల నీరు ఉంటుంది. ఇవి శరీరానికి రోగనిరోధక శక్తిని పెంచుతాయి. ఆస్టియోపోరోసిస్, నరాల సంబంధిత సమస్యలు, కీళ్ల నొప్పులను తగ్గించేందుకు ఇది సహాయపడుతుంది. తేగల్లో ఒమేగా-3 ఫ్యాటీ ఆసిడ్ ఎక్కువ మోతాదులో ఉండటం వల్ల శరీరంలో మంచి కొలెస్ట్రాల్ పెరుగుతుంది. ఇది గుండె జబ్బుల అవకాశాన్ని తగ్గిస్తుంది. అంతే కాకుండా.. ఇది శరీర కణాలను రక్షించడంతో పాటు శరీర అవయవాలకు రక్షణ కల్పిస్తుంది. తేగల్లో అధికంగా ఫైబర్ ఉండటం వల్ల రక్తంలో షుగర్ స్థాయిని నియంత్రించేందుకు సహాయపడుతుంది. దీని వల్ల మధుమేహ రోగులు దీనిని తినొచ్చు. అయితే దీనిలోని కొన్ని పోషకాలు ఇన్సులిన్ ఉత్పత్తిని పెంచుతాయి. అందువల్ల డాక్టర్ల సలహాతో లిమిటెడ్ గా మాత్రమే తీసుకోవడం మంచిది. తేగల్లో అధిక ఫైబర్ ఉండటం వల్ల జీర్ణవ్యవస్థకు మంచిది. ఇది మలబద్ధకాన్ని తొలగించడంతో పాటు కడుపులో పేరుకునే పురుగులను నివారించగలదు. అలాగే రక్తంలో కొలెస్ట్రాల్ పెరగకుండా అదుపు చేస్తుంది. తేగల్లో కాల్షియం ఎక్కువగా ఉండటం వల్ల ఇది ఎముకలకు, దంతాలకు బలాన్ని అందిస్తుంది. పిల్లలకు ఇది మేలైన ఆహారం. ఇది ఎముకల సమస్యలు, కండరాల నొప్పులను తగ్గించేందుకు సహాయపడుతుంది. దీనిలో మెగ్నీషియం కూడా ఉండటం వల్ల ఎముకల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. తేగలను ఉడకబెట్టి మెత్తగా చేసి బెల్లం లేదా చక్కెరతో కలిపి తీసుకోవడం



వల్ల గర్భాశయం బలంగా అవుతుంది. కొబ్బరి పాలతో కలిపి తీసుకుంటే ఇంకా ఎక్కువ ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. నీరసంగా ఉండే మహిళలు తేగలను ఎండబెట్టి పొడి చేసి బెల్లం లేదా తాటి సిరప్‌తో కలిపి తీసుకుంటే శక్తి వస్తుంది. ప్రసవం తర్వాత తేగలను తినడం వల్ల పోయిన పోషకాలు తిరిగి వస్తాయి. పైగా మొత్తం ఆరోగ్యం మెరుగుపడుతుంది. తేగలలో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి మహిళల్లో క్యాన్సర్ కణాలు పెరగకుండా నిరోధించడంలో సహాయపడతాయి. ఇందులో విటమిన్ ఎ, అమైనో ఆమ్లాలు, ప్రోటీన్లు ఉంటాయి. ఇవి క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తాయి. 40 ఏళ్లు పైబడిన మహిళలు తరచుగా ఐరన్ లోపంతో బాధపడుతుంటారు. ఇది రుతుక్రమం ఆగిపోయే సంబంధిత ఆరోగ్య సమస్యలకు కారణమవుతుంది. తేగలను ఎర్ర రక్త కణాల ఉత్పత్తిని పెంచడానికి, సరైన రక్త ప్రసరణను నిర్ధారించడానికి, శరీరానికి ఆక్సిజన్ అందించడానికి సహాయపడుతుంది.

## ప్రభుత్వ సహాయం కోసం అనాధపిల్లల ఎదురుచూపులు

**ముధోల్ (మన వెలుగు) జనవరి 31 :** ముధోల్ మండలంలోని ఆష్ట గ్రామంలో గత కొన్ని రోజుల క్రితం తల్లిని చంపిన ఘటన మానవత్వానికి మాయని మచ్చలా మారింది. అనాధ అయిన పిల్లలని అన్ని విధాలుగా ఆదుకుంటామని నాయకులు పరామర్శించి ఆర్థిక సాయం మనోధైర్యాన్ని నింపుతుంది. తెలిసి తెలియని వయస్సులో తల్లి మరణం అనంతరం నానమ్మ ఈరబాయి కాయ కష్టం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న సందర్భంలో తనయుడే తల్లిని హతమార్చడంతో అనాధగా మారిన పుష్ప గంగాధర్ దిన స్థితిని ఎవరికి చెప్పాలో ఏం చేయాలో అర్థం మానసిక వేదనకు గురి అవుతున్నారు. గ్రామంలో చోటు చేసుకున్న సంఘటనపై గ్రామస్తులు ఎవరికి తోచినంత వాళ్లు సాయం చేస్తానే ఉన్నారు. గ్రామస్తులు కుటుంబ సభ్యులుగా చూపిస్తున్న ప్రేమ ఆ ప్రయత్నం మేము



జీవితం కాలం రుణపడి ఉంటామని రాష్ట్ర ప్రభుత్వం మా భవిష్యత్తుకు బంగారు బాట వేస్తారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## బాసరకు బిజెపి కార్యకర్తలు తరలిరావాలని పిలుపు

### - వసంత పంచమి వేళ ప్రభుత్వం ఏర్పాట్లు చేయకపోవడంతో ఆగ్రహం

### - హిందువుల పండుగలపై ఇంత వివక్ష ఎందుకు..?

**బాసర (మన వెలుగు) జనవరి 31:** బాసర జ్ఞాన సరస్వతి అమ్మవారి సన్నిధిలో వసంత పంచమి ఏర్పాట్లలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు రోజుల నుండి అధికారులకు ప్రభుత్వానికి విన్నవిస్తున్నప్పటికీ గోదావరి ఘట్ల ను శుభ్రపరచకపోవడంతో అసంతృప్తికి లోనయ్యారు. హిందువుల పండుగ అంటే ప్రభుత్వానికి ఎందుకంత వివక్షో అర్థం కావడం లేదన్నారు. భక్తులు పుణ్య స్థానాలు ఆచరించే పవిత్ర జలం అపరిశుభ్రతతో ఉంటే ఎలా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. రేపు ఉదయం 9 గంటలకు బాసర అమ్మవారి క్షేత్రంలో గోదావరి నది స్నాన ఘట్టాల వద్ద స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని చేపట్టనున్నామని పెద్ద మొత్తంలో బీజేపీ కార్యకర్తలు తరలిరావాలన్నారు. స్వచ్ఛభారత్ ఘట్లను పరిశు భ్రం చేద్దామన్నారు. అనంతరం ప్రభుత్వ తీరుపై శాంతియుతంగా నిరసన తెలుపుతామన్నారు.



## నెయ్యిని ఎక్కువగా తీసుకుంటే ప్రమాదమా..?

నెయ్యితో మన ఆరోగ్యానికి చాలా ఉపయోగాలు ఉన్నాయి. ఇందులో విటమిన్లు, ఫ్యాటీ యాసిడ్స్, యాంటీ ఆక్సిడెంట్స్ వంటి పోషకాలు అధికంగా ఉంటాయి. అయితే చాలా మంది దీనిని సరిగ్గా ఎలా తీసుకోవాలో తెలియక ఎక్కువగా తక్కువగా తీసుకుంటారు. కొందరూ అయితే మానేస్తారు కూడా. నిజానికి నెయ్యిని ఆరోగ్యకరమైన పద్ధతిలో తీసుకుంటే మన శరీరానికి ఎన్నో లాభాలు ఉన్నాయి. నెయ్యిలో విటమిన్-ూ, ఐ, జు, ఖ, ఒమేగా-3, ఒమేగా-6 వంటి పీచు తత్వాలు, లినోలిక్ యాసిడ్, బ్యుటిరిక్ యాసిడ్ వంటి ఫ్యాటీ యాసిడ్స్ ఉన్నాయి. ఇవి మన ఆరోగ్యానికి ఎంతో దోహదపడతాయి. నెయ్యి మన వంటలో అత్యధికంగా ఉపయోగిస్తాము. నెయ్యి ఆరోగ్యానికి మంచిదే అయినా.. దీనిని ఎక్కువగా తీసుకోవడం మంచిది కాదు. ప్రతి రోజు ఉదయం ఖాళీ కడుపుతో ఒక స్పూన్ నెయ్యి గోరువెచ్చని నీటిలో వేసి తాగాలి. ఇలా తాగడం వల్ల శరీరానికి ఎంతో లాభం ఉంటుంది. ఉదయాన్నే గోరువెచ్చని నీటిలో నెయ్యి కలిపి తాగడం వల్ల మలబద్ధకం సమస్య పరిష్కరించబడుతుంది. నెయ్యిలో ఉన్న బ్యూట్రిక్ యాసిడ్ పేగులకు ఆరోగ్యకరంగా పనిచేస్తుంది. ఈ విధంగా నెయ్యిని తీసుకోవడం వల్ల జీర్ణశక్తి పెరుగుతుంది. జీవక్రియ బలపడుతుంది. మన శరీరంలోని టాక్సిన్స్ బయటకు వెళ్లి కాలేయం శుభ్రపడి చర్మం మెరుస్తుంది. నెయ్యి శరీరానికి తేమను అందిస్తూ.. చర్మాన్ని మృదువుగా, కాంతిగా మారుస్తుంది. నెయ్యి ఎముకల బలాన్ని పెంచుతుంది. ఇందులో ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్, కాల్షియం ఉండడం వల్ల



ఎముకలు బలంగా మారుతాయి. మెదడుకు కూడా మంచి పోషణ అందుతుంది. జ్ఞాపకశక్తి పెరుగుతుంది. కాబట్టి పిల్లలకు కూడా నెయ్యి ఎంతో మంచిది. ఎదిగే పిల్లలకు రోజుకు ఒక స్పూన్ నెయ్యి గోరువెచ్చని నీటిలో కలిపి తాగించాలి. బరువు తగ్గాలనుకునే వారు కూడా నెయ్యిని తీసుకోవచ్చు. నెయ్యిలో ఉండే ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వు బరువు తగ్గడంలో సహాయపడతాయి. ఉదయాన్నే ఒక గ్లాస్ గోరువెచ్చని నీటిలో ఒక టీ స్పూన్ నెయ్యి కలిపి తాగడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. బరువు తగ్గడానికి ఈ విధానం చాలా ప్రభావవంతంగా ఉంటుంది. అయితే దీనిని ఒక స్పూన్ మాత్రమే తీసుకోవడం సరిపోతుంది. ఎక్కువగా తీసుకోవడం వలన దుష్ప్రభావాలు కూడా ఉంటాయి.

## శొంఠి వాడకంతో అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలు

శొంఠి పొడిలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు ఇమ్యూనిటీ పెంచడంతో పాటుగా నొప్పులు, వాపులు నుండి ఉపశమనం కలిగిస్తాయి. శొంఠి పొడిని అన్నంలో కూడా కలుపుకొని తినవచ్చు. ఇందుకోసం ముందుగా శొంఠిని వేయించుకోవాలి. ఆ తర్వాత కొద్దిగా జీలకర్ర, మెంతులు, వాము, ధనియాలు వేయించుకొని. అన్ని కలిపి మిక్సీలో పొడి చేసుకోవాలి. శొంఠి.. అల్లానికి ప్రతిరూపమే ఇది..అల్లాన్ని ఎండబెడితే తయారయ్యేదే శొంఠి. శొంటితో బోలెడన్ని ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. ఈ శొంఠి పొడిని ఆహారంలో భాగంగా చేసుకుంటే అది మన శరీరానికి ఊహించని మేలు కలిగిస్తుందని చెబుతున్నారు.. ముఖ్యంగా బరుగు తగ్గాలని ప్రయత్నించే వారికి ఇది దివ్యౌషధంగా పనిచేస్తుందని అంటున్నారు. ఇందుకోసం గోరువెచ్చటి నీళ్లలో ఒక చెంచా యాపిల్ సైడర్ వెనిగర్, అర చెంచా శొంఠిపొడి కలిపి తాగితే మీ శరీరంలో ఉన్న అదనపు కొవ్వు కరిగి బరువు తగ్గుతారని అంటున్నారు. ఒక గ్లాసు నీళ్లలో అర చెంచా శొంఠిపొడి కలిపి మరిగించాలి. ఆ తర్వాత అందులో రుచి కోసం కొద్దిగా నిమ్మరసం, తేనే కలిపి తాగినట్లయితే మీ శరీరంలో కొవ్వును కరిగించుకోవచ్చు. అంతేకాదు.. శొంఠిలో జీర్ణక్రియను మెరుగుపరిచే లక్షణాలు పుష్కలంగా ఉన్నాయి. శరీరంలో పేరుకుపోయిన చెడు కొలెస్ట్రాల్ ను ఐస్‌లా కరిగిస్తుంది. శొంఠి పొడిలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు ఇమ్యూనిటీ పెంచడంతో పాటుగా నొప్పులు, వాపులు నుండి ఉపశమనం కలిగిస్తాయి. శొంఠి పొడిని అన్నంలో కూడా కలుపుకొని తినవచ్చు.